87

# త్యాగానికి రెండు పేర్లు!

అనగా అనగా

ఒకాయన వుండేవాడు.

నల్లనివాడు కాదు గాని చామన చాయవాడు.

పద్మనయనంబులవాడు మాత్రం కాదు. నిశ్చల తేజోమయమైన చూపులవాడు బడుగు మనిషే కాని మేరునగధీరుడు మాటలాడితే నిదానంగా వుండేది నిజాని కాయన మాటల మనిషికాదు చేతల మనిషి.

పుట్టినది పెన్ననది సీమ

మెట్టినది జాతియోద్యమ సీమ

వాక్కెంత మెత్తనో, సంకల్పమంత వజ్రం.

పట్టితే అది వదిలే పట్టుకాదు.

నిజానికి "పట్టు"ల విషయంలో ఉడుములు ఆయన్ను చూచి నేర్చేవి అయితే ఆపట్టులన్నీ స్వంతానికి కావు అవి దేశం కోసం, తన వారయిన

ప్రజల కోసం పట్టిన పట్టులు హరిజనుల దేవాలయ ప్రవేశం అన్న సమస్యే తీసుకోండి.

ఆయన పూనుకున్నాడు.

మహామహులు ఓడినచోట ఘనవిజయం సాధించాడు.

"ఆసలాయనలాటి వాళ్ళు పదిమంది నాతో వుంటేనా – ఈ దేశానికి స్వాతంత్ర్యం ఏనాడో సాధించి వుండేవాడిని-" అని మహాత్మా గాంధీ అంతటివాడు 1947కు చాలా కాలం ముందే అన్నాడు

అదీ "ఆయన" వ్యక్తిత్వం.

అదీ "ఆయన మద్రాసులో మైలాపూర్‌లో ఒక మూల ఇంటిలో ఆమరణ నిరశనదీక్ష పూనాడు. యాభై రెండు రోజుల దారుణమైన ఉపవాసం తర్వాత కన్ను మూశాడు.

ఆయన ఆత్మార్పణం జవహర్‌లాల్ అంతటి నాయకుని గుండెల్లో రైళ్లు పరుగెత్తించింది.

ఆంధ్రరాష్ట్రం అవతరించింది!

★

ఇక రెండవ ఆయన....

మనిషి తెల్లనివాడు.

మనసు తెల్లనివాడు

నిండైన విగ్రహంపువాడు.

వాడిమాటల వాడు

వేడి తెలుగువాడు.

బాల్యంనుండి కష్టాలనెదిరించి కాలు ముందుకు వేసినవాడు.

తాను నమ్మినదానికి ప్రాణాలొడ్డ సిద్ధమైనవాడు.

తుపాకి ఎదురైతే రొమ్ము విరిచినవాడు.

న్యాయరంగంలో సూర్యుడు.

పత్రికా రంగంలో చిచ్చర పిడుగు

రాజకీయాలలో పెద్ద తుఫాను

మనసులో ఏది వుంటే అదే మాటలో వచ్చేది. మాటలో ఏది వస్తే అదే చేతగా మారేది. ఆమనిషి జీవితం స్పటిక సమానం. ఆయన త్యాగం ఈ దేశంలోనే అపూర్వం. ఆయన ధైర్యం జగత్ప్రసిద్ధం.

కర్రవాడుగానే ఎంతటివారినయినా ఢీ కొన్నవాడు.

మహాత్మాగాంధి అంతటివాడిని నిలదీసి అడిగినవాడు.

తెలుగు వారికోసం తన జీవితమంతా ధారపోసినవాడు.

పదవిలో వున్నా లేకపోయినా బ్రతికినంతకాలం తెలుగు ప్రజలకు కిరీటం లేని రాజు.

ముమ్ముందు తరాల వారిని ఉత్తేజితం చేయగల జీవితం ఆయనది. తెలుగు జాతికి ఏనాడయినా అఖిల భారత స్థాయిలోకి చేర్చి చెప్పుకోదగిన నాయకుడు.

అతడనేక యుద్ధముల నారితేరిన వృద్ధమూర్తి.

మొన్న నవంబరు ఒకటిన ఆంధ్ర ప్రదేశ్ అవతరణోత్సవ దినమట.

ఆలాగని తెలుగు పత్రికలలో రెండేసి పేజీలు, ఇంగ్లీషు పత్రికల్లో నాల్గేసి పేజీలు వున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రకటనలు చెప్పాయి

అందులో మనం సాధించినదంతా వుంది సాధించబోయేది వుంది.

వాళ్ళవీ వాళ్ళవీ ఏవో ఫోటోలు కూడా వున్నాయి.

కాని, పైన చెప్పిన ఒకటో ఆయన, రెండో ఆయన ఫోటోలు కావుగదా పేర్లు కూడాలేవు ఖర్చైన ఆ పేజీలలో!

నిజంగా మనం ఎంత ఎదిగిపోయామండీ.!

(10. నవం. 77)